# భార్యా కురూపి...?

కార్తీక సోమవారం. పగలంతా ఉపవాసం ఉండి రాత్రి నోములు నోచుకుంది జానకి. పూజకొచ్చిన ముత్తైదువలు, పేరంటాండ్రు దివ్యప్రసాదం అందాక ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళందర్నీ సాగనంపాక జానకి దేవుడింట్లోని ఫలహారాలు అత్తగారికి పెట్టింది.

అత్తగారికి వంట్లో బాగుండకపోవడం వల్ల ఆవరల గదిలో పడుకొనివుంది. మరిది హనుమంతరావు స్నేహితులింటికి వెళ్ళిన ట్టున్నాడు యింకా యింటికిరాలేదు. కోడ లిస్తున్న ఫలహారం తీసుకొంటూ ముసలావిడ అడిగింది :—

"అబ్బాయి కేమైనా పెట్టావా అమ్మా?"

"ఆయన యింట్లోలేరు. సినిమాకి వెళ్ళిన ట్టున్నారు" అంది.

"ఉంటేమాత్రం ఆయన దివ్యప్రసాదాన్ని ఎప్పుడైనా కళ్ళకద్దుకొని తిన్నారు గనుకనా?" అనుకుంది మనసులో మాత్రం.

తల్లి ఒక్క నిట్టూర్పు విడిచింది.

జానకి తిరిగి దేవుడింట్లోకెళ్ళి, ఆ ప్రసాదాన్ని కళ్ళకద్దుకొని నోట్లో వేసు కుంది. తర్వాత ఒక అరటిపండు తినటం ప్రారంభించింది.

ఆమె కెందుకో చప్పున విచిత్రమయిన భావం కలిగింది! ఆయనకి తను తగినఅర్థాంగిని కానేమో నని! ఆయన విద్యాధికుడు, సుందరుడు, స్ఫురద్రూపి. కాని తను? తనకి చాకలిపద్దులు రాయటంతప్ప మిగతా విద్యా ప్రపంచం శూన్యం. పోనీ సంక్రమించవలసిన చదువు రాకపోగా ప్రకృతిసిద్ధమైన సౌందర్య మన్నా వుందాంటే తనకదీ కరువేఅయింది. ముఖం, ముఖవర్చస్సు, శరీరలావణ్యం— అన్నీ...

కాని—

ఆయనకి తనంటే ప్రాణం.

తనని ఆయన సౌందర్యరాశిగా కొలిచే క్షణాల్లో, తనని ఎవరో కత్తులతో, సూదు లతో పొడిచి హింసిస్తున్నట్టు బాధపడేది. ఆయన తనబాధనిచూసి,—

"నీలో అంతరాత్మ ఎంత అందంగా వుందో నీకేం తెలుసు జానకీ" అనేవారు.

ఆయన "సంస్కృతభావ" మెందుకో అంతగా అర్థమయేదికాదు. కాని రానురాను దానిని అర్థంచేసుకో మొదలు పెట్టింది. దాంతో ఆమెకు భర్తమీద భక్తి నమ్మక ఏర్పడింది.

కాని అప్పుడప్పుడు ఎందుకో ఇలాంటి అనుమానాలు, శంకలు కలుగుతూవుంటాయి. చేతిలో పండు నిక తినలేకపోయింది. చప్పున ఆ గౌరీదేవి ముందు పడిపోయి కన్నీళ్ళతో అభిషేకం చేయ మొదలుపెట్టింది. చుట్టూ కళకళ్ళాడుతూ వెలుగుతున్న జ్యోతులు విచిత్రంగా ఆ శాంత మూర్తివేపు చూడ నారంభించాయి. మంగళగౌరిముందు వెలుగు తున్న దీపం ఆ విసురుకు రెపరెపలాడి ఆరి పోయినా మిగతా దీపాలుమాత్రం వాటిపని అవి చేసుకుపోతున్నాయి.

అప్పుడు రాత్రి సరిగా ఎనిమిదిన్నర అవుతుంది!

'శ్రీనాథ్'

## 2

వాసుదేవరావు టీపార్టీనుంచి ఇంటికి తిరిగి వచ్చేసరికి సరిగా రాత్రి పదయింది. ఇంట్లో చూస్తే యింకేముంది? ఏడుపులూ పెడ బొబ్బలు వినిపిస్తున్నాయి. అతని అడుగులిక ముందుకి సాగలేదు.

కొడుకుని చూడగానే తల్లి ఇల్లెగిరిపో యేట్టు ఏడవటం ప్రారంభించింది. ఆమె చుట్టూ మూగివున్న ఆడవాళ్ళల్లో ఎవరో ఒకావిడ అంది:

"జానకమ్మ దేవుడింట్లో కాలిపోయింది."

వాసుదేవరావు వెనక్కి తూలిపోయాడు!

"ఎక్కడుంది?" అన్నాడు పొడిగా.

"ఆస్పత్రికి తీసుకువెళ్లారు పక్కింటి సబి న్స్పెక్టర్ గారు."

వాసుదేవరావు మారుమాటాడకుండా ఆసు పత్రికి బయలుదేరాడు.

హాస్పిటల్ దగ్గర సబ్ఇన్స్పెక్టర్ రాం బాబుగారూ, ఎదురింటి లాయరుగారూ కనిపించారు. అప్పుడే ఆపరేషన్ థియేటర్ నుంచి డాక్టర్ కూడా బయటికి వచ్చి రాంబాబుని పిలిచి :

"ఆమెకు కాలిపోవడంవల్ల ప్రాణం పోలేదు; అంతకుముందే ఎవరో ఆమెను పీక పిసికి చంపారు. ఆ రహస్యం పొక్కకుండా వుండేందుకు హంతకుడే ఆమె చీరకు నిప్పు పెట్టి వుండొచ్చు..."

వాసుదేవరావు గతుక్కుమన్నాడు.

"పీక పిసికి చంపారా? ఎవరు? ఎవరు?" అన్నాడు.

రాంబాబు చప్పున వెనక్కి తిరిగి—

"విచిత్రంగా వుందే! అంత ధైర్యంగా ఇంట్లోకొచ్చి పీక పిసికి చంపగలిగే ధైర్యమె వరుంటారు?" అన్నాడు. అతని ఉద్దేశంలో ఎవరో 'దొంగ'అయివుంటాడని.

"అన్నట్టు వస్తువులు, నగలు ఏమైనా పోయాయేమో చూశారా?"

"లేదు. నేను, ఈ కబురు విని తిన్నగా యిలా వచ్చేశాను."

"నేను పోస్టుమార్టమ్ రిపోర్టు తీసుకొస్తాను" అని డాక్టర్ లోపలికి వెళ్ళిపోయాడు.

రాంబాబు ఒక నిట్టూర్పువిడిచి "ఇప్పుడు మాకు పని తగిలింది" అన్నాడు.

ఈ మాటలకు వాసుదేవరావు రాంబాబు వేపు విచిత్రంగా చూశాడు.

వాసుదేవరావు స్థానిక కళాశాలలో అధ్యాపకుడు. ఆయనకు విద్యార్థుల్లోనూ, అధ్యాపకుల్లోనూ పేరూ, పలుకుబడీ వుంది. క్లాసులో తన పనేదో తాను చూసుకొని బయటకు వచ్చేసేవాడు. మితభాషి. సహో ధ్యాయులతో కూడా తూచి మాటాడేవాడు ...ఆయన వుండే ప్రాంతంలో కూడా లాయర్లూ, డాక్టర్లూ, పెద్దమనుషులు నివ సించేవారు. అలాంటి సంస్కార సమాజం మధ్య వాసుదేవరావుకూడా ఒక సంస్కార వంతుడుగా పరిగణింపబడుతూ వున్నాడు. అలాంటిది యిప్పుడు తన భార్య (ఆత్మ) హత్య(?)సందర్భంలో పోలీసువాళ్ళ వాక బులు, కోర్టులు తలచుకునేసరికి వాసుదేవ రావుకి గుండె జలదరించింది. తన పరువు మర్యాదలన్నీ తన ఎదురుగానే కుప్పగా కూలిపోతున్నట్టు భయపడ్డాడు. అందుకే రాంబాబువేపు తిరిగి—

"రాంబాబుగారు! పోయిన జానకి తెలాగూ పోయింది. ఇది హత్య అయినా, ఆత్మహత్యయినా, పొరపాటున కాలిపోయి మరణించినా—ఇహ యిది పోలీసుకేస యిందా నానాగొడవా జరుగుతుంది..." అన్నాడు.

# ★ భార్యా కురూపి...? ★

రాంబాబు అతనివైపు సానుభూతితో చూశాడు:

"మీ బాధ నాకు అర్థమయింది వాసుదేవరావుగారూ. కాని డాక్టరు రిపోర్టు ఇచ్చాక కూడా నేను వ్యక్తిగతంగా ఈ రహస్యాన్ని ఎలా దాచెయ్యగలను చెప్పండి?"

వాసుదేవరావు మాట్లాడలేదు.

సబ్ ఇన్‌స్పెక్టర్ ఆలోచనలో పడ్డాడు: నాయకిని నిజంగా ఎవరు చంపివుంటారు? ఎవరో దొంగలు వచ్చి నగలు దోచుకోవడం కోసం ఆమెను హత్యచేసివుంటారా? లేక... ఆమె సొంత ప్రవర్తన ఎలాంటిది?

ధర్మ ఇన్నాళ్లుగా వాసుదేవరావుగారింటి పక్కన వుండికూడా, ఆమెను తప్పు పట్టుకున్నాడంటే...ఏమో! జనరాంద్ర చిత్తముల్...

ఆమె దేవుడింట్లో చనిపోయింది. ఒకవేళ 'వాడు' ఆమెను పీక పిసికి, ఇది ఆత్మహత్యగా అనుకోవాలని ఆమె చీరకు అగ్గి పెట్టివుంటాడా?

అతని కంతా అయోమయంగా తోచింది.

## 3

ఈ కేసు 1949 లో రాజమండ్రిలో జరిగింది. పోలీసుడైరీలో 'కూపీ' దొరక్కుండా ఈనాటివరకూ అపరిష్కృతంగా వుండిపోయిన కొద్ది కేసుల్లో యిదొకటి!

రకరకాల అపరాధపరిశోధకులు, పోలీసుశాఖవారు ఈ కేసు విషయంలో చూపించిన ప్రత్యేక శ్రద్ధాసక్తులు బూడిదలో పోసిన పన్నీరైనవి. అయితే వాళ్ళు కనిపెట్టిన కొన్ని కొత్త విషయాలు డిటెక్టివ్ సుందరానికి కొంతవరకూ తోడ్పడ్డాయి.

హత్య ఎనిమిది, తొమ్మిది మధ్యలో జరిగింది. ఈ హత్య జరిగాక హంతకుడు ఆమెను కాల్చాలని కాల్చాడు. అందువల్ల హంతకుడు చాలా తెలివైనవాడైవుండాలి.

ఆమె మెడలో నెక్లెసు, ఒక గొలుసూ వున్నాయి. అవి ఆమె మెడలోనే వున్నాయి. అదీగాక ఆ యింట్లో ఏవస్తువులు కానీ, డబ్బుగాని పోలేదు. కాబట్టి హంతకుడు దొంగ అయివుండడు.

నాయకికి ఇదివరకెంత ప్రేమకథ వుండి వుండొచ్చునని కొందరు అపరాధ పరిశోధకులు ఆమె జీవిత విశేషాలు సేకరించారు.

ఆమె బాగా పేద కుటుంబంలో జన్మించింది. తండ్రీ, తల్లీ పెద్ద సంస్కృతి కలవారుకారు. అందువల్ల ఆమె కూడా పెద్ద చదువులు చదవలేకపోయింది. అయినా తల్లివల్ల చిన్నతనం నుంచీ దైవభక్తి, పాపభీతి ఆమె రక్తంలో జీర్ణించుకుపోయాయి. ఆమె సౌందర్యవతి కాదు. ముఖం చూస్తే కొంత వికృతంగా వుంటుందికాని, మరీ వికృతంగా కనిపించదు. ముందుకు పొడుచుకొచ్చిన నాలుగు పళ్ళూ నాసికారంధ్రాలని మరింత పెద్దవి చేయటంవల్ల ఆ వికృతి వచ్చిందికాని ఆమె వికలాంగి మాత్రం కాదు. ఆమె ఎవరినీ ప్రేమించలేదు...ఇదీ ఆమె గురించి వాళ్ళు తెలుసుకున్న నిజాలు. ఆమె వాసుదేవరావుకి మేనకోడలు కావటమే వాళ్లిద్దరి వివాహానికి దారి తీసింది.

ఈ రిపోర్టంతా చూశాక, సుందరానికి విచిత్రమైన అనుమానాలూ, ఆలోచనలూ కల్గాయి.

"వాసుదేవరావుకి నాయకంటే ఇష్టమేనా?"

"వాసుదేవరావు తమ్ముడు హనుమంతరావు ఎలాంటివాడు?"

"అసలు వాసుదేవరావు వ్యక్తిగతంగా ఎలాంటివాడు?"

ఈ ప్రశ్నలు అతన్ని కలవరపెట్టాయి.

సుందరం మొట్టమొదటిసారి హనుమంతరావు మీద తన ప్రయోగాలు సాగించాడు. కాలేజీలో అతని ప్రవర్తన ఎలాంటిదో వాకబు చేశాడు. ప్రిన్సిపాల్, లెక్చరర్లూ అతని 'క్యారక్టర్' 'కాండక్టు' మంచిదేనని చెప్పారు. అదీకాక అతను చిత్రకారుడు కావడంవల్ల అతనిదంతా మరో ప్రపంచమని చెప్పారు.

సుందరానికి హనుమంతరావుని స్వయంగా పరీక్షించాలనిపించింది. ఒకనాడు కలుసుకొని 'కళ' గురించి ప్రస్తావించి, అతని అభిప్రాయం అడిగాడు.

హనుమంతరావుకి చిత్రకళ గురించి అంతగా తెలీదు. అయినా తన చిత్రాల గురించీ, వాటి ఉత్పత్తిగురించీ విపులంగా చెప్పగలిగాడు.

"మీ చిత్రాల్లో భావం ప్రధానం కాదా?" అన్నాడు సుందరం.

"భావం లేకపోతే, నా చిత్రాలకి ప్రాణంలేదు," అన్నాడు హనుమంతరావు.

సుందరం కాసేపు ఊరుకొని అతని చిత్రాలన్నీ చూస్తూవున్నాడు. హనుమంతరావు సాయంకాలం తనింటికి రమ్మన్నాడు.

సుందరం సాయంకాలం హనుమంతరావు ఇంటికి వెళ్ళాడు. ఇంట్లో వాసుదేవరావు లేడు. హనుమంతరావు తనచిత్రాలన్నీ అతనికి చూపించాడు. కాని అతనికి కావలసినభావంకల చిత్రం ఒకటీ కనిపించలేదు.

సుందరానికేం పాలుపోలేదు. [illegible] అన్నాడు:

"నాకో భావం తట్టింది. దానికిస్వరూపం ఇవ్వాలిమీరు."

"చెప్పండి."

"నాకో తెలిసిన అమ్మాయి వుంది. ముఖానికి చాలావికృతంగా వుంటుంది. ముందున్న నాలుగుపళ్ళూ పైకిపొడుచుకొచ్చి నాసికారంధ్రాలని మరింత పెద్దవిచేయటంవల్ల ఆ వికృతంవచ్చింది. ఆమెముఖాన్ని సౌందర్యం కోసం. ఆమెను ఎవ్వరైనా చూసినా తల తిప్పెయ్యాలని బుద్ధిపుట్టేది. అలా అందవికారంగా వుండటం ఆమెతప్పుకాదు. అయినా నాకు ఆమెమీద కోపము. ఆమె ఒకనాడు కాలిపోయింది. ఆ కాలిపోతున్నప్పుడు ఆమెచేస్తున్న ఆక్రందన ఏదో నా హృదయాన్ని కరిగించింది. ఏ వికృతాకారాన్నయితే నేను ద్వేషిస్తూవచ్చానో, ఆ వికృతాకారాన్ని నేను రక్షించేందుకు ఆమంటల్లో దూకాను. మానవహృదయానికుండే సహజమైన సానుభూతి అప్పుడు నాలో విజృంభించింది...దీనికి సరైన రూపకల్పనయివ్వాలి మీరు."

హనుమంతరావు, తన భావనాశక్తినంతటినీ ఉపయోగించి ఆ భావానికొక రూపాన్నిస్తానన్నాడు.

వారందినాలతర్వాత హనుమంతరావు చిత్రాన్ని తయారుచేశాడు. ఆ చిత్రాన్ని చూశాక సుందరానికి నవ్వాలనిపించింది. అందులో తను ఆశించిన 'సింపతీ' కొంచెమయినా కనిపించలేదు. తను కావాలని నాయకి వికృతాకారాన్ని అతనికి వర్ణించి చెప్పినా, ఈచిత్రంలో నాయకి ఆకారాన్ని మాత్రం అతను కొద్దిగానైనా చిత్రించలేదు. అందువల్ల హనుమంతరావుకి వదినమీద ఎలాంటి ప్రేమా, ద్వేషం లేవని నిశ్చయించుకున్నాడు.

ఇక మిగిలిందల్లా వాసుదేవరావు!

## 4

ఒకయేడాది గడిచింది.

వాసుదేవరావుకి సుందరానికి స్నేహం హెచ్చింది. స్నేహంతోపాటు ఆత్మీయత కూడాహెచ్చింది. ఈ పరిచయంలో సుందరం, వాసుదేవరావు మనస్తత్వాన్ని చాలవరకు అర్థంచేసుకోగలిగాడు. అయితే సుందరం అపరాధ పరిశోధకశాఖకి చెందినవాడని వాసుదేవరావుకి తెలీదు.

ఒకనాడు సుందరం పుట్టినరోజుపండుగ చేసుకున్నాడు. ఆ సాయంకాలం టీపార్టీ అయింది. పార్టీకి పెద్దపెద్దవాళ్లందరూ సతీసమేతంగా హాజరయ్యారు. ఒంటరిగా హాజరయింది కేవలం ఒక వాసుదేవరావే!

పార్టీకిముందు గానసభ జరిగింది. ప్రఖ

జరుగుతున్నంతసేపూ సుందరం వాసుదేవరావువేపు పరిశీలనగా చూడసాగాడు. తర్వాత మెల్లగా అతని పక్కకి చేరాడు.

"మీరు మరోలా భావించకండా వుంటె ఒకటడుగుతాను."

"చెప్పండి."

"మరో పెళ్ళి మీరెందుకు చేసుకోరు?"

వాసుదేవరావు అతని వైపు విచిత్రంగా చూశాడు. తర్వాత అదోలా నవ్వుతూ తలవంచేసుకున్నాడు.

అంతలో సుందరం భార్య సుగుణ అక్కడికివచ్చి లాయరు రమణరావుగారు ఎందుకో రమ్మంటున్నారని చెప్పింది. అప్పుడు చూశాడు వాసుదేవరావు సుందరం భార్యని! ఎంత అందంగావుంది!

క్షమించమని చెప్పి సుందరం, భార్యతో కలసి అటువేపు వెళ్ళాడు.

వాసుదేవరావుకి యింకా అక్కడ వుండాలనిపించలేదు; మెల్లగా లేచి గేటులోంచి బయటకు వెళ్ళిపోయాడు. ఆ వెళ్ళడం వెళ్ళడం తిన్నగా గోదావరిఒడ్డుకెళ్ళి ఇసకలో కూచున్నాడు ఆలోచిస్తూ రెండు గంటలసేపు.

నెల దినాల తర్వాత ఒకనాడు సుందరం వాసుదేవరావుదగ్గర కొచ్చాడు. ఏదో పిచ్చాపాటీ మాటాడుకొంటూ మాటమీద మాటొచ్చి సుందరం——

"ఈమధ్య మా స్నేహితుడొకడు ఒక పత్రిక పెట్టాడు. దానికి మేటరులేక కొట్టుకు ఛస్తున్నాడు. వీలుంటె మీరు ప్రతీమాసం 'మనసమాజంలో వివాహ సమస్య' అని వ్యాసాలు వ్రాస్తారూ?" అన్నాడు.

వాసుదేవరావు తిన్నగానవ్వి: 'చూస్తాను' అన్నాడు.

"చూస్తానంటే కాదు. ఇంతకముందు మీరు పత్రికలో వ్రాస్తే మన స్తత్వానికి సంబంధించే వ్యాసాలు చదివి చాలా సంతోషించాను. అలాంటి వ్యాసాలయినా సరే- ఏదో ఒకటి- అతని పత్రిక్కి మేటరు కావాలి."

"రాస్తానులెండి" అన్నాడు.

వారం దినాల తర్వాత సుందరం మళ్ళా అతని దగ్గరకు వచ్చాడు.

"వ్యాసం రాయలేకపోయాను" అన్నాడు వాసుదేవరావు క్షమించమన్నట్టు ముఖం పెట్టి.

"మరి"

"ఒక నవల వ్రాశాను. వీలైతే అది ఉపయోగించుకోమనండి."

"ఇవ్వండి."

వాసుదేవరావు నాలుగువందలపేజీల పెద్ద వ్రాతప్రతినితీసుకొచ్చి అతనికిచ్చాడు. సుందరం మొదటపేజీ చూశాడు. 'భార్యా కురూపి——?'-అది ఆ నవలశీర్షిక. సుందరం వ్రాతప్రతిని టేబిలుమీద వుంచి,

"భార్యా కురూపి——? అంటే?" అని ఆశ్చర్యంగా అతనివేపుచూసి, ఆలోపించిన దానిని పూర్తిచేస్తున్నట్టు: "శత్రువా?" అన్నాడు.

"చదవండి" అన్నాడు వాసు ముక్తసరిగా.

సుందరం ఆ వ్రాతప్రతిని తీసుకొని వెళ్ళి ఆరాత్రంతా దీక్షగా చదివాడు.

అందులో కథ ఏమీలేదు. కథ చిన్నదే కాని కథానాయకుని మానసిక ప్రవర్తన రచయిత అమోఘంగా చిత్రించాడు.

ఆ నవలలో కథానాయకుడు ఒక కళాకారుడు. అతనికి సంఘంలో హోదా, పేరూ, మర్యాద వున్నాయి. కాని అతని వూహలకి, భావాలకి తగిన సహచరి దొరకలేదు. అతను పిరికివాడు. అందువల్ల తల్లిదండ్రుల్ని ఎదిరించలేక, వాళ్ళు తెచ్చిన సంబంధాన్ని ఒప్పుకొని పెళ్ళి చేసుకొంటాడు.

పెళ్ళయాక అతను తన భార్యను చూసుకుంటాడు. ఆమె ముఖంలో కాని, మాటల్లో కాని ఏలాంటి సౌందర్యమూ అతనికి కనిపించలేదు. ఆమె బాగా పల్లెటూరి నుంచి వచ్చిన పిల్ల. కాని అతని కళాహృదయం ఆమెలో అక్కడా యిక్కడా దాగివున్న సౌందర్యాన్ని లక్షరెట్లు ఎక్కువ చేసుకొని తృప్తిపడబోయేది.

ప్రపంచంలో ఏవ్యక్తీ ప్రేమించనంతగా తన భార్యను ప్రేమించేవాడు. అందమైన ఆడవాళ్ళని చూసినపుడు మాత్రం ఎందుకో దిగులుగా కూలిపోయేవాడు. ఆ సౌందర్యరాశుల భర్తల్నీ, దాంపత్యాన్నీ వూహించుకున్నాడుమాత్రం అతను పిచ్చెత్తినట్లు



# భార్యా కురూపి...?

తిరిగేవాడు. ప్రపంచమంతా సౌందర్యంతో, మాధుర్యంతో మురిసిపోతూంది, తనుమాత్రం అలా ఎందుకు మురిసిపోకూడదు అనుకునేవాడు.

రాను రాను అతను ఈ భావాలతో స్వప్నవిహారి అయిపోయాడు. భార్య ఎదురు పడినప్పుడుకూడా అతనికి భార్య భౌతిక రూపం అగుపించేదికాదు. ఆమె అంతరంగంలో ఒక ఊర్వశి, రతీదేవి కనిపించేది?

అతను తరచు సాహిత్య, సంగీత సమావేశాలకి వెళుతూ వుండేవాడు. అప్పుడప్పుడు ఉపన్యాసాలు యిచ్చేవాడు. ఇది అతనికి చాలమందితో స్నేహానికీ పరిచయానికీ దారి తీసేది. పరిచయస్తులు ఎక్కువగా స్త్రీలే. వాళ్ళల్లోని అందం, లావణ్యం, చురుకుతనం అతన్ని వేడిపించేవి.

తన కురూపిభార్యను ప్రపంచమంతటిలోకీ సౌందర్యరాశిగా భావించుకోవటం ఆత్మవంచనేమో అని బాధపడ్డాడు. ఈబాధ ఎవరితో చెప్పుకోలేదు. ఈ బాధకి ఉపశమనం కలగకపోవడంతో పిచ్చెత్తిపోయేవాడు. ఆపిచ్చితో అతనికి కోపం హెచ్చేది. హెచ్చుకావటంతో భార్యను మరింత ప్రేమమూర్తిగా, సౌందర్యరాశిగా ఆరాధించేవాడు.

ఈ విచిత్ర భావావేశం అతని జ్ఞాపకశక్తిని క్షీణింపచేసేది. ఇహ అతనికి ప్రపంచమంతా భార్యే అయింది. ఇరవైనాలుగు గంటలూ ఆమె ఎదురుగా, కూచుని కాలం గడిపేవాడు. మనుస్సులోని బాధ హెచ్చేకొద్దీ భార్యమీద ప్రేమ అధికమయేది. ఈ బాధ క్షణక్షణానికీ హెచ్చిపోవడంతో, ఇహ భరించలేక ఒకనాటి రాత్రి ఎక్కడికో పరారి అయిపోయాడు.

ఇదీ కథ.

కథంతా పూర్తిచేశాక సుందరం హుషారుగా లేచాడు.

మర్నాడు వ్రాత ప్రతిని తీసుకొని వాసుదేవరావు యింటికి వెళ్లి—

"ఈ కథచివర్లో కొంత మార్పుచెయ్యాలిసుంటుందేమో!" అన్నాడు.

"ఏమిటా మార్పు?" అన్నాడు వాసుదేవరావు.

"ఇందులో కథానాయకుణ్ణి పరారి చేసే కంటె, అతనిలోని బాధ, కోపం, కసి ఆకురూపి భార్యను పీకపిసికి చంపివేసేట్టు చూపిస్తే మరింత బావుండేదేమో!"

అగ్ని పర్వతాలు ఒక్కసారి బ్రద్దలయ్యాయి. లక్ష ఆటంబాంబులు ప్రేలిన బీభత్సం కలిగింది.

వాసుదేవరావు నోట మాటలేదు. కనురెప్పలు పడలేదు! అతని ఎదురుగా వున్నది ఎవరో కూడా గుర్తులేదు. అతనికి ప్రపంచమంతా తిరుగుతున్నట్టనిపించింది. కాళ్ల క్రింది భూమి క్రుంగి పోతోంది. లావాద్రవం అతన్ని చుట్టుముట్టింది.

చాల సేపు నిశ్శబ్దం!

వాసుదేవరావు నోరు ఎండిపోయింది!

సుందరం వ్రాత ప్రతి అతనికి అందిస్తూ లేచి నిలబడి—

"క్షమించండి వాసుదేవరావు గారూ! నేను ఏ పత్రికకూ విలేఖరిని కాను. మీ భార్య హత్యకేసులో ప్రభుత్వం నియమించిన డిటెక్టివ్‌ని" అన్నాడు.

## 5

డిటెక్టివ్ సుందరం అన్నాడు:

"ఈ నవలకు మీరు "ఆత్మకథ" అని నామకరణం చేసివుంటే ఎంతో బావుండేది. కాని మీకా ధైర్యం లేదు. మీతో నాకు రమారమి రెండేళ్ళ పరిచయం వుంది. ఆ పరిచయంతోనే మీ మనస్తత్వాన్ని నేను చాలవరకు అర్థం చేసుకోగలిగాను. ఆ నాపరిచయంతోనే, మీ నవల చదివాక మీ భార్యను చంపింది మీరే అనే నిర్ణయానికి వచ్చాను.

"రచయిత సాధారణంగా తన కథలో, చాలావరకు తన భావాలని వ్యక్తపరుస్తాడు. ఆ భావాలు పూర్తిగా తన మనస్తత్వానికి ముడిపడి వున్నప్పుడు కథని మరింత హృద్యంగా వ్రాయగలడు. అదీ గాక 'భార్యా కురూపీ—?' అనే మీ నవలలో ఆ 'డేష్'... తర్వాత ప్రశ్నార్థకం నాలో మరింత అనుమానాలనీ, శంకలనీ కలిగించింది. 'భార్యా కురూపీ శత్రుః' అని పూర్తిచేసుకొని కథ చదివాను.

"కాని చివర్లో మీకు భార్యను చంపినట్టు వ్రాసేంత ధైర్యం లేక పోయింది. అందుకే నాయకుణ్ణి పరారి చేసి వొదిలేశారు.

"నేను ఈ చుట్టుపక్కలవాళ్ళను బాగ వాకబుచేసి చూస్తే, మీరు మీ భార్యను ఏ నాడూ పల్లెత్తుమాటకూడా అనలేదని, ఆమెను ప్రాణసమానంగా చూసుకోనేవారనీ తేలింది. ఆ మీ ప్రేమ మీలోని మూగబాధకి ప్రతిఫలం. ప్రపపంచమంతా సౌందర్యంతో నిండివున్నా, మీ సహచరి మాత్రం కురూపి కావటం మీరు భరించలేక పోయినా, మీలో ద్వేషం విచిత్రమైన ప్రేమగా మారి, ఆమెను ప్రాణ సమానంగా ఆరాధించేట్టు చేసింది. కాని మీ లోని కోపం మాత్రం అణిగిపోలేదు.


"1949 కార్తీక సోమవారం రాత్రి మీరు ఒక స్నేహితునింట్లో టీపార్టీల్లో వున్నారు. ఆవాళ రాత్రే మీ భార్య కాలిపోయింది. ప్రపంచమంతా ఆమె కాలిపోయిందే అనుకున్నారు కాని, ఆమెను ఎవరో హత్యచేసి కాల్చివేసినట్టు అనుమానించలేదు. అయితే ఈ హంతకుడెవరు? ఆ 'ఎవరో' మీరు కారనేందుకు మీకు పెద్ద 'ఎలిబీ' వుంది. కాని మీరు ఆవాళ పార్టీనుంచి సరిగ్గా ఎనిమిది గంటలకు ఇంటికి వచ్చేశారు. మీరు రావడం ఎవరూ చూడలేదు. నేను ఋజువు చెయ్యలేను కూడా. ఆ రావటానికి కారణం మీ ద్వేషం.

"ఆ మధ్య మీకు నా పుట్టినరోజు పండక్కి పెద్దపార్టీ యిచ్చాను. ఆ వాళ కూడా మీరు సగంవరకు వుండి ఎవరికీ చెప్పకండా ఇంటికి వెళ్ళిపోయారు. ఎందుకు ఆ 'ఎందుకు?' అనే ప్రశ్నకు 1949 కార్తీక సోమవారం నాటి రాత్రి పార్టీ నుంచికూడా మీరు ఇంటికి వెళ్ళిపోవడమే సమాధానం! పార్టీలో మీకు కావాలని నా భార్యను మీ ఎదురుగా రప్పించాను. అందమైన స్త్రీలను చూస్తున్నపుడు మీకు కలిగిన ఆ వేదన, భరించరానిదై మీ భార్య అందవిహీనతమీద కసినీ, కోపాన్నీ హెచ్చించి ఆమెను శాశ్వతంగా మీ ఎదుటనించి తీసేసేటట్టు చేసింది. అవునా? అవునా?

వాసుదేవరావు మాటాడలేదు.

ఏమిటి మాటాడగలడు?

అతని కళ్లనిండా నీళ్లునిండాయి. అవి మీద పడలేదు. అతని గుండెల్లో ఇంకిపోయాయి!



బ్రాంచిలు: హైదరాబాదు & విజయవాడ.